మొగవాళ్లూ ఒకటే! ఇక కొందరు ఆడవాళ్లు రంకుతనం చెయ్యటం దేనికి అంటే- వాళ్ల పొగరు, తలకాయలో జబ్బు- అంతకంటే ఏమీ లేదు.

చిత్రమేమిటంటే రంకుతనం సుఖరోగాదులకు దారితీస్తుందని, దాని ద్వారా కడుపులు కావటమూ, భ్రూణహత్యలూ మొదలైన చిక్కులేర్పడతాయనీ కూడా ఇందిరకు తెలియదు.

ఇందిరను మనం తప్పుపట్టనవసరం లేదు. సంఘంలో నీతి అనేది అమలు జరుగుతున్నది, నూటికి తొంభైతొమ్మిది పాళ్లు ఇటువంటి విశ్వాసాలమీదే. భార్యాభర్తలు వివాహ బంధానికి కట్టుబడి ఉంటున్నారుకాని, ప్రేమ బంధానికి కట్టుబడి వుండటం లేదు. ఈ వివాహ బంధం ఆడదాన్ని కట్టినంత బలంగా మొగవాణ్ణి కట్టడం లేదేమో. మొగవాడు ఆడదానికంటే స్వేచ్ఛగా నీతిని ధిక్కరిస్తున్నాడు.

❖ ❖ ❖

ఇందిరకిప్పుడు పధ్నాలుగో ఏడు. వచ్చే డిసెంబరు సెలవుల్లో అల్లుణ్ణి ఇక్కడికే తీసుకురమ్మని చడీచప్పుడు లేకుండా అవశిష్టం పూర్తి చేసేద్దామనుకుంటున్నాడు ఇందిర తండ్రి. ఇందిరకు ఒక అన్న మాత్రమే ఉన్నాడు. అతను కూడా ఇందిర మొగుడులాగే బియ్యే రెండో సంవత్సరం చదువుతున్నాడు.

ఇందిర తండ్రి ఏమంత కలవాడు కాడు. ఒకప్పుడేదో అన్నవస్త్రాలకి లోపం లేకుండా ఉండేది. కాని, ఆ రోజులిప్పుడు కలలోకి కూడా రావటం లేదు. ఎప్పుడు కొడుకు చదువు పూర్తిచేసి నాలుగు రాళ్లు తెస్తాడా అని ఆ మానవుడు ఆశపెట్టుకుని ఎదురుచూస్తున్నాడు. కట్నమంటూ చిల్లిగవ్వ అల్లుడికివ్వకపోయినా ఇందిర పెళ్లి చేసేసరికి ఆయన నడుం విరిగిపోయినట్టయిపోయింది. కొడుక్కి ఏ నెలకానెల అరవయ్యో, డెబ్బయ్యో పంపాలంటే పీకలమీదికి వస్తున్నది. నిర్బంధంలో ఉన్న ఖైదీ రోజులు లెక్కించినట్టు ఆయన నెలలు లెక్కిస్తున్నాడు.

తన తండ్రి డబ్బుకోసం పడే ఇబ్బంది ఇందిర చూస్తూనే ఉండేది. ఎంత చెడ్డా తన మొగుడు తన తండ్రికన్నా కాస్త మంచి స్థితిలో ఉండటం తలచుకుని ఆమె సంతోషించేది.

ఆమెకు నీతి అయినా అర్థమయ్యేదిగాని డబ్బు అసలే అర్థమయ్యేది కాదు. ఆమె పక్కనే ఉన్న పార్వతమ్మగారింటికి తరచూ పోతూ ఉండేది. వాళ్లు చాలా డబ్బుకలవాళ్లు. మళ్లీ వాళ్లక్కూడా సెంటు పొలం లేదు. ఆ పార్వతమ్మ మొగుడు ఏవో కంట్రాక్టులు అవీ చేస్తాడు. వాళ్లింట్లో చక్కగా అన్నీ అమరి వుంటై. దేనికీ తడువుకోనవసరం లేదు. ఆవిడ చూసిన చీరల్లా కొంటుంది. పళ్లూ, పూలూ రోడ్డువెంట పోనివ్వదు. కొంటే కాసినీకూసినీ కొనదు. ఊరికే వచ్చినట్టుగా రెండు చేతులా దానం చేస్తుంది. ఆవిడకి పిల్లలు లేరు. ఇందిరను చాలా అపేక్షగా చూసేది. ఇంటికి వస్తే ఊరికే వెళ్లనిచ్చేది కాదు.

